మార్కెట్‌కు చవితి శోభ

- ఉరూవాడా విఘ్నాధిపతి సందడి
- జనంతో కిటకిటలాడిన మార్కెట్‌లు
- ముస్తాబైన ఉత్సవ శిబిరాలు
- పెరిగిన పూజా సామగ్రి ధరలు



కొవ్వూరు మెయిన్ రోడ్డులో వినాయక విగ్రహాల విక్రయం



పూజా సామగ్రి కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న నిడదవోలు గాంధీబొమ్మ సెంటర్

కొవ్వూరు: విఘ్నాధిపతిని కొలిచేందుకు ఊరూవాడా ముస్తాబయ్యాయి. శనివారం నుంచి వినాయక చవితి వేడుకలు ప్రారంభం అవుతున్నాయి. పల్లె, పట్నం అనే భేదం లేకుండా కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా పిల్లల్లోనూ, పెద్దల్లోనూ పండుగ ఉత్సాహం నెలకొంది. పూజా సామగ్రి కొనుగోలుదారులతో కొవ్వూరు మెయిన్ రోడ్డు శుక్రవారం కిటకిటలాడింది. మార్కెట్‌కు చవిత కళ వచ్చింది. మరోపక్క ఉత్సవ శిబిరాలు చవితి వేడుకలకు సిద్ధమయ్యాయి. ఒక శిబిరాన్ని మించి మరో శిబిరం వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెయిన్ రోడ్డులోని టాక్సీస్టాండ్ వద్ద 500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ, కంఠమణి రామకిషోర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పిల్లలమర్రి లక్ష్మీనారాయణ శర్మ చారిటబుల్ ట్రస్టు తరఫున మట్టి గణనాథుడి విగ్రహాలను ఉచితంగా అందజేశారు.

నిడదవోలు: పట్టణంలోని వివిధ సెంటర్లలో సుమారు 20 వరకూ మంటపాల్లో గణనాథులు కొలువుదీరేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇళ్లలో వినాయక పూజలు చేసుకోవడానికి అవసరమైన పూజా సామగ్రి ధరలు బాగా పెరిగాయి. అయినప్పటికీ కొనుగోలుదారులతో శుక్రవారం నిడదవోలు మార్కెట్ రద్దీగా కనిపించింది. పట్టణంలోని గాంధీబొమ్మ, గణపతి సెంటర్‌లలో పూలు, పండ్ల దుకాణాలు, కొనుగోలుదారులతో కళకళలాడాయి.

నిడదవోలు రూరల్: గణపతి నవరాత్రుల నిర్వహణకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు చేశాయి. తాడిమళ్ల, పందలపర్రు, సమిశ్రగూడెం గ్రామాల్లో భారీగా విద్యుత్ దీపాలంకరణలు, మండపాలు, ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలంలో 30 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చామని సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. ఉత్సవ కమిటీల సభ్యుల పర్యవేక్షణలో శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

అందుబాటులో లేని పండ్లు, పూల ధరలు

దేవరపల్లి: గణనాథుడిని కొలిచేందుకు వీధివీధినా నిర్వాహకులు మంటపాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలు అలంకరించారు. ఈ ఏడాది చవితి వేడుకల నిర్వహణకు ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించడంతో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారుల అనుమతి కోసం నిర్వాహకులు నిరీక్షిస్తున్నారు. శుక్రవారం వరకూ అనుమతులు జారీ చేయలేదు. శనివారం గణనాథులు మండపాల్లో కొలువు తీరనున్నాడు.

మార్కెట్లో కొనుగోలుదారుల సందడి

మార్కెట్లో శుక్రవారం పూజాసామగ్రి కొనుగోలుదారుల సందడి నెలకొంది. దేవరపల్లి బస్టాండ్ సెంటర్లో పత్రి, పూలు, వినాయక ప్రతిమలు, పండ్లు దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే వాటి రేట్లు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. వెలగ, మారేడు, దానిమ్మ, బత్తాయి, యాపిల్ ధరలు ఆకాశాన్ని అంటాయి. ఏ పండు కొనాలన్నా ఒక్కొక్కటి రూ. రూ.20 నుంచి రూ. 25 రేటు పలుకుతున్నాయి. సైజును బట్టి వినాయక ప్రతిమలు ధర పలుకుతున్నాయి. పూల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిల్లరగా రూ. 20 నుంచి 50 పూలు కొనుగోలు చేసి సరిపెట్టుకుంటున్నారు.

రద్దీగా తాళ్లపూడి బజార్ సెంటర్

తాళ్లపూడి: పూజా సామగ్రి కొనుగోలుదారులు, విక్రేతలతో శుక్రవారం తాళ్లపూడి బజార్ సెంటర్ కిటకిటలాడింది. వినాయక విగ్రహాలు, పత్రి, పాలవెల్లులు, గొడుడులు, పండ్లు, పూలు కొనుగోలు చేసే వారితో సందడిగా మారింది. మార్కెట్లో రంగులు వేసిన వివిధ రూపాల్లోని మట్టి వినాయక విగ్రహాలు కొనుగోలుదారులను ఆకర్షించాయి. భక్తులకు ఈ ఏడాది కూడా మార్కెట్లో ధరాఘాతం తప్పలేదు. వినాయక విగ్రహాల రేటు రూ.20 నుంచి రూ. 300, రూ.500, 600 వరకూ పలికాయి. గొడుగులు రూ.15 నుంచి రూ. 25 వరకూ, పూలమాలలు రూ.100 నుండి రూ.180 వరకూ ఉన్నాయి. యాపిల్ నాలుగు రూ.100, బత్తాయిలు రెండు రూ.30 పలుకుతున్నాయి.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలోని శివశ్రీ శిల్పాకళా నిలయం నుంచి శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు ఉత్సవాల నిర్వాహకులు గణనాథుని విగ్రహాలను కొనుగోల చేసి వాహనాలపై తరలించారు. మరోపక్క పూలు, పండ్లు, పత్రి, వినాయకుడి మట్టి విగ్రహాల కొనుగోలుదారులతో శుక్రవారం ఉండ్రాజవరం మెయిన్ రోడ్డు సందడిగా మారింది. మండలంలో వేలివెన్ను గ్రామంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో లక్ష్మీ గణపతి ఉత్సవాల నిర్వహణకు భారీఎత్తున ఏర్పాటు పూర్తి చేశారు. కాగా ఉండ్రాజవరం ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు చివటం, పాలంగి తదితర గ్రామాల్లోని వినాయక మంటపాలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంటపాల వద్ద ఎలాంటి అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయరాదన్నారు.



దేవరపల్లి మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పండ్లు, పూలు, పత్రి



తాళ్లపూడిలో విక్రయిస్తున్న మట్టి వినాయక విగ్రహాలు

చుక్కలనంటిన పూల ధరలు



పెరవలి మండలం కాకరపర్రు పూల మార్కెట్‌లో కొనుగోళ్లు

పెరవలి: వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులతో మండలంలోని కాకరపర్రు పూల మార్కెట్ శుక్రవారం ఉదయం నుంచీ కళకళలాడింది. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో బంతి పూలు రూ.80 రేటు పలకగా, చామంతి పూలు రూ.300, కనకాంబరాలు రూ.2000 పలికాయి. ఇక మల్లెపూలు, సన్నజాజులు కిలో రూ.1500 పలికాయి. గులాబీలు ఒక్కొక్కటి రూ.4, చామంతి పువ్వు ఒక్కొక్కటి రూ.4 రేటు పలికాయి. విడిగా మార్కెట్‌లో మూర మల్లె పూలు, జాజులు రూ.100, కనకాంబరాలు మూర రూ.200 రేటుకు విక్రయించారు.

స్వాగతం పలుకుతున్న చాగల్లు

చాగల్లు: గణపతి నవరాత్ర మహోత్సవాలకు చాగల్లు స్వాగతం పలుకుతోంది. చాగల్లు తెలగా సంఘం, చాగల్లు,నెలటూరు వర్తక సంఘాల ఆధ్వర్యంలో ఏటా వేర్వేరుగా నవరాత్ర ఉత్సవాలు పోటాపోటీగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం ప్రారంభమయ్యే ఉత్సవాలు ఈ నెల 15 వరకూ కొనసాగుతాయి. రెండు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలోనూ భారీ సెట్టింగులు, విద్యుద్దీపాల అలంకరణ పూర్తి చేస్తున్నారు. ఈ 9 రోజులూ చాగల్లు ప్రధాన కూడలి విద్యుద్దీపాల వెలుతురులో ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. ఈ సందర్భంగా రోజూ రా త్రిపూట ఏర్పాటుచేసే సాంస్కృతిక కార్యక్రమా లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. రూ.50 లక్షల కు పైగా ఖర్చుతో ఉత్సవాలకు నిండుతనం తెచ్చేందుకు రెండు కమిటీల వారు కృషి చేస్తున్నారు. తెలగా సంఘం ఆధ్వర్యంలో గంగ్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలోను, వర్తక సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కళావేదిక వద్ద భారీ సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.



తెలగా సంఘం ఆధ్వర్యంలో చాగల్లులో ముస్తాబవుతున్న వేడుకల వేదిక

క్లుప్తంగా

బాధితులకు వైఎస్సార్ సీపీ ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలతో విజయవాడకు పయనమవుతున్న గోపాలపురం నాయకులు

గోపాలపురం: విజయవాడ వరద బాధితుల ఆకలి తీర్చేందుకు వైఎస్సార్ సీపీ గోపాలపురం నాయకులు శుక్రవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సుమారు రెండు వేల మందికి ఈ ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఈడ్పుగంటి సత్యనారాయణ, ముల్లంగి శ్రీనివాస రెడ్డి, కూసం రామమోహన్‌రెడ్డి, ముప్పన కృపా ప్రసాద్, ఎస్‌కే నబీ, ముప్పిడి అనుదీప్‌రెడ్డి చెప్పారు.

నల్లజర్ల: విజయవాడ వరద బాధితులకు మండలంలోని త్రీ ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువ చేసే 30 వేల ఆహార ప్యాకెట్లు, వాటర్‌బాటిల్స్ తరలించారు. వాటిని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ములుగు మాధురి, జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్, తూర్పు గోదావరి జిల్లా డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాథరావు, ఏపీ ఎంఐపీ పీడీ దుర్గేష్‌ల ఆధ్వర్యంలో బాధితులకు అందజేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలంలో పడి ఉన్న యువకుడు చరణ్

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన తానుకొండ చరణ్ (22) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం చరణ్ బైక్‌పై గండి చెరువు వైపు నుంచి ఇంటికి వస్తుండగా చెరువు సమీపంలో ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చరణ్ కుడి చెయ్యి పూర్తిగా కట్ అయి దూరంగా పడింది. క్షతగాత్రుడిని, తెగిపడిన చెయ్యిని హుటాహుటిన చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువులు తరలిస్తున్న వారిపై కేసు



బొలెరో వాహనంలో తరలిస్తున్న ఆవులు, ఎద్దులు

నల్లజర్ల: విజయనగరం నుంచి హనుమాన్ జంక్షన్‌కు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 5 ఆవులు, 2 ఎద్దులను జాతీయ రహదారిపై నల్లజర్ల ఎస్‌ఐ హరిబాబు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పశువుల వ్యాపారి ఇనిగిరి సతీష్, డ్రైవర్ తాడివలస రామకృష్ణలపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆవులు, ఎద్దులను గోశాలకు తరలించినట్టు చెప్పారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

దేవరపల్లి: పర్యావరణానికి హాని చేయని విధంగా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలనే నినాదంతో పలు సంస్థలు మట్టితో తయారు చేసిన గణనాథుని విగ్రహాలను పలుచోట్ల శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. దేవరపల్లిలోని పెడసనగంటి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెడసనగంటి సాయిబాబు శుక్రవారం 500 మంది భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ ప్రతిమలను ప్రముఖ పారిశ్రామికవేత్త, పరమేశు బయోటెక్ ఫ్యాక్టరీ అధినేత ఉపేంద్రరెడ్డి చేతుల మీదుగా భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు తిగెల బలరామయ్య, పెడసనగంటి శశికాంత్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడిలో శుక్రవారం 100 వినాయక మట్టి ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ రీజినల్ చైర్మన్ వి. చంద్రయ్య, సభ్యులు సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, చంద్రగుప్త, టీఎస్‌బీ గుప్త, సీహెచ్ ఆంజనేయులు, గర్రే శ్రీరామకృష్ణ, తడికొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు గొల్తి రామబ్రహ్మం, కార్యదర్శి నాగోజు వీరసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుశాఖ ఆధ్వర్యంలో వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొర్లేపర రత్నకుమార్, కార్యదర్శి అనంతపల్లి కృష్ణచైతన్య, కోటిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాచర్ల చైతన్యబాబు, గాలి రాఘవయ్య, పెచ్చెట్టి ఫణిసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: విజయ గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మండలంలోని కె.సావరం రామాలయం వద్ద శుక్రవారం వినాయక మట్టి ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వర్రే రమేష్(బాబి), పుప్పాల మురళి, చెన్నా సత్యనారాయణ, మీసాల సురేష్, సుంకర వెంకటేశ్వరరావు, మీసాల సుబ్రహ్మణ్యం, కాకర్ల నాగు, సఖినాల అనిల్, నీలం సుబ్రహ్మణ్యం, పంచాయతీ సర్పంచ్ నార్ని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో భక్తులకు మట్టి వినామక ప్రతిమలు పంపిణీ చేస్తున్న పారిశ్రామిక వేత్త ఉపేంద్ర రెడ్డి



నిడదవోలులో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎస్సై శోభన్‌కుమార్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ
- డివిజన్ స్థాయిలో సమీక్ష

కొవ్వూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలే అనేక అనర్థాలకు మూలమని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివిజన్ స్థాయిలో బాల్య వివాహాల నిర్మూలన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.యువతికి 18 ఏళ్లు, యువకుడికి 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అన్నారు. డివిజన్,మండల, గ్రామస్థాయిల్లో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలన కమిటీలు ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై బాల్య వివాహాలపై సమీక్షించాలని ఆయన ఆదేశించారు. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సీడీపీవో డి.మమ్మి బాల్య వివాహాలు, వివిధ రకాల చట్టాల గురించి వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను సబ్ కలెక్టర్ పరిశీలించారు. కొవ్వూరు డీఎస్పీ కె.దేవకుమార్, ఎంపీడీవోలు, ఎంఈవోలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

బైక్ చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

నిడదవోలు రూరల్: బైక్ చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామంలో తాళం నరేష్‌కి చెందిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 4న కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టగా బైక్ చోరీకి పాల్పడిన రాజమహేంద్రవరానికి చెందిన జవ్వాది సూర్య సందీప్, బర్ల చంద్రశేఖర్, బి.లీలా త్రినేష్ అనే వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఉత్తమ గురువులకు ఏపీటీఎఫ్ సన్మానం

తాళ్లపూడి: మండలానికి చెందిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఏపీటీఎఫ్ తాళ్లపూడి మండల శాఖ తరఫున శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.దుర్గారావు ఆధ్వర్యంలో వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సుభాషిణిని, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.పద్మసుజాతలను ఆయా పాఠశాలల్లో పూలమాల, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పి.రఘువీర్ శాస్త్రి, మండల ప్రధాన కార్యదర్శి యాదం శంకరం, జిల్లా కౌన్సిలర్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఉత్తమ ఉపాధ్యాయులు సమాజానికి ఎంతో అవసరమని డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి అన్నారు. మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పి.హేమంత్‌కుమార్, కేవీ వెంకట్రావు, స్పోక్స్ సంస్థ నుంచి జాతీయ అవార్డు అందుకున్న బొండల శ్రీనివాసరావులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషబ్రహ్మం, మండల శాఖ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమాబాయి, కార్యదర్శి రాంబాబు,అప్పలాచారి, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో సుభాషిణిని సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు



జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు డీటీఎఫ్ ఆధ్వర్యంలో నల్లజర్లలో సన్మానం

10న కొవ్వూరులో జాబ్ మేళా

కొవ్వూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల పదో తేదీన కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. ఈ జాబ్ మేళాకు టీవీఎస్, ఎంజీ మోటార్స్, హెటిరో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఐటీఐ డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. పదో తేదీ ఉదయం 9 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభం అవుతుందన్నారు. వివరాల కోసం 73062 32373 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న గోదావరి వరద ఉధృతి



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పరవళ్లు తొక్కుతున్న గోదావరి



పెరవలి మండలం తీపర్రు వద్ద నీట మునిగిన అరటి తోట



పెరవలి మండలం తీపర్రు పుష్కరాల రేవులో పరమేశ్వరుడి విగ్రహాన్ని తాకిన వరద

కొవ్వూరు: గోదావరి నదిలో వరద ఉధృతి భారీగా పెరిగింది. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి వరద ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలంలో నీటిమట్టం తగ్గుతూ, పెరుగుతూ నిలకడగా కొనసాగుతోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 12.30 అడుగుల వద్ద నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వల్పంగా తగ్గుదల కనిపిస్తోంది. రాత్రి ఏడు గంటలకు 10,36,440 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు.నదీ తీరం వెంబడి ఉన్న ఇసుక ర్యాంపులన్నింటిని వరద ముంచెత్తింది.

ముంపులో 800 ఎకరాల్లోని లంక పంటలు

పెరవలి: వశిష్ట గోదావరికి మరోసారి వరద పోటెత్తింది. దిగువ లంకల్లోని పంటలన్నీ నీట మునిగాయి. గత నెలలో వచ్చిన గోదావరికి తీవ్రంగా నష్టపోయిన లంక గ్రామాల రైతులు ఇప్పుడు మరోసారి వరద ముంచెత్తడంతో లబోదిబోమంటున్నారు. మండలంలోని కానూరు, కానూరుఅగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లోని 800 ఎకరాల్లోని దిగువ లంకల్లోని పంటలు ముంపు బారిన పడ్డాయి. ఈ లంకల్లో అరటి, కంద తోటలు, కూరగాయల పంటలైన వంగ, బెండ,బీర,ఆనప, చిక్కుడు, క్యాబేజీ, దొండ పందిర్లు, పచ్చిమిరప తోటలు, ఆకుకూరలైన గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర వంటి పంటల మునిగిపోయాయి. నాలుగు రోజులుగా వరద నిలకడగా ఉన్నప్పటికీ గురువారం రాత్రి నుంచి గంట గంటకూ పెరగడంతో లంక రైతులు పంటలు దక్కుతాయా అంటూ ఆందోళన చెందుతున్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE(SENIOR DIVISION)::KOTHAPETA
F.D.I.A.No.8/2024 in O.S.No.172/2010

Between
Jeedigunta Chalapathi Rao .... Petitioner
and
Jeedigunta Nageswara Rao & others ....Respondents

I, Jeedigunta Nageswara Rao S/o Late Sankurayya, Age 55 years, D.No.5-285, Kanuru Village, Peravali Mandal, TJCJC.

పిటీషనర తరఫున వేయబడిన ప్రకటన

[illegible]

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

గుడిమెట్ల వీర్రెడ్డి

[illegible]

తేది: 06-09-2024